# నేహాల



సాయి బ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత  సంచిక నుంచీ తరువాయి)

## 6

**వేదరాయ శర్మ శంభుడితో** కలిసి విజయనగరం పయనమయ్యాడు. రేవన్న గుర్రబగ్గీ ఏర్పాడు చేసాడు. గంగావతి వరకే బండివాడు ఒప్పుకున్నాడు. గంగావతి చేరడానికి రెండు దినాలు పట్టచ్చు. వేదరాశర్మకి గంగావతిలో బంధువులు ఉన్నారు. అక్కడోక దినం గడిపి మరలా విజయనగరం వెళ్ళచ్చులే అని వేదరాయశర్మ అనుకున్నాడు .ప్రయాణానికి సరిపడా తినుబండారాలూ, పళ్ళూ రేవన్న ఏర్పాటు చేసాడు. గురుకులం బాధ్యత రేవన్నకి అప్పగించి బయల్దేరాడు. రేవన్న వెళ్ళక పోవడంతో నేహల ఊపిరి పీల్చుకుంది.

వేదరాయ శర్మ విజయనగర ప్రాకార నిర్మాణ శంఖుస్థాపనకి మంచి ముహూర్తం నిర్ణయించాడు. పుష్య  బహుళ అష్టమి నాడు మంచి ముహూర్తంగా నిర్ణయించాడు. అతని నక్షత్రానికి నాడు తారాబలం కలిసింది. శుభకార్యాలకి అష్టమి మంచి తిథి కాకపోయినా - నాడు తారాబలం దేవరాయలకి అనుకూలంగా ఉంది. సంపత్తారయ్యింది. అలాగే అతని జన్మ సమయాన్ని బట్టి చూసినా  ముహూర్త బలం వల్ల దేవరాయలకి అఖండ కీర్తి లభిస్తుంది. అష్టమీ శనివారం నాడు శన్యూష సమయానికి ముహూర్తం కుదిరింది.  ఈ ముహూర్త విషయం రెండు వారాల క్రితమే ఒక మిత్రుని ద్వారా దేవరాయలకి పంపించాడు. వేదరాయశర్మ తండ్రి గతంలో ముఖ్యమైన  రాజ ముహూర్తాలు పెట్టేవాడు. రాజాస్థానంలో పండితులూ, పురోహితులూ ఉన్నా రాయల వంశం వేదరాయశర్మ కుటుంబానికే ముహూర్తాలు నిర్ణయించే గౌరవం దక్కేది. గతంలో ఒకసారి  ఆనెగొంది కోట ప్రాకార నిర్మాణానికి వేరే ఎవరిచేతో ముహూర్తం పెట్టిస్తే, తదనంతరం రాజ వంశీకుల్లో గొడవలు జరిగాయి. ప్రస్తుత రాజు దేవరాయలు పెద్దన్న విరూపాక్ష రాయల్ని రెండో అన్నగారు బుక్కరాయలు హతమార్చి రాజ్య సింహాసనం  ఆక్రమించుకున్నాడు. ఇది ప్రజలకీ, రాజ్యాధికారులకీ మింగుడు పడలేదు. కొంతకాలం ప్రజలనుండీ, ప్రతినిధులనుండీ నిరసన ఎదుర్కొన్నాడు బుక్కరాయలు.  తరువాత దేవరాయలూ బుక్కరాయలు విరూపాక్ష రాయలకి చేసిన పనే చేసాడు. బుక్కరాయల్ని చంపి, సింహాసనం ఎక్కాడు. ఈ విపత్తులన్నింటికీ కారణం  ఆనెగొంది కోట ప్రాకార నిర్మాణ ముహూర్తం వేదరాయ శర్మ కుటుంబం పెట్టకపోవడం వల్లే జరిగిందన్న శంక కలిగింది దేవరాయలకి. అందువల్ల తన పట్టాభిషేక ముహూర్తాన్ని వేదరాయ శర్మ తండ్రి చేతే పెట్టించాడు.  తరువాత విజయనగరంలో సుస్థిరత ఏర్పడింది. గత మూడేళ్ళగా అక్కడక్కడ చిన్న చిన్న యుద్ధ భయాలొచ్చినా రాజ్యం సుభిక్షంగానే ఉంది.  ఆ నమ్మకంతోనే దేవరాయలు కోట ప్రాకార ముహూర్తం వేదరాయశర్మనే పెట్టమన్నాడు.  వేదరాయశర్మ కూడా అదొక బాధ్యతలాగానే స్వీకరిస్తాడు.

ప్రతీ సారీ విజయనగరం వెళ్ళేటప్పుడు ఎవరో ఒకర్ని వెంట బెట్టుకెళ్ళడం ఆయన అలవాటు. రేవన్నే అన్ని ఏర్పాట్లూ చూసేవాడు. రేవన్న మంచి పనిమంతుడవడం వల్లా, తెలివైన వాడవడం వల్లా అన్ని పనులకీ అతని మీదే ఆధారపడతాడు వేదరాయశర్మ. ఈసారి అతను తోడుగా రాని లోటు వేదరాయ శర్మకి కొట్టచ్చినట్లు కనిపించింది. గంగావతిలో ఓ పూటుండి మర్నాడే విజయనగరం బయల్దేరారు. విజయనరం చేరే సరికి బాగా పొద్దుపోయింది. మహారాజు ఏర్పాటు చేసిన విడిది గృహంలో బస చేసారు. మర్నాడు ఉదయమే రాజదర్శనానికి విచ్చేస్తానని కబురు పంపించాడు వేదరాయశర్మ.

ఆ మర్నాడు ఉదయమే తుంగభద్రలో స్నానమాచరించి, విరూపాక్ష సందర్శనం చేసుకొన్నారు వేదరాయశర్మా, శంభుడూ. కాస్త పొద్దు గడిచాక రాజ దర్శనానికి వెళ్ళారు. శంభుడుకి రాజమందిరానికెప్పుడూ వెళ్ళలేదు. క్రితంసారి దసరా ఉత్సవాలకి విచ్చేసినా, రాజమందిరానికి వెళ్ళే అవకాశం రాలేదు. మహారాజు ముందు వినయంగా ఉండమనీ, అడిగిన వాటికే జవాబు చెప్పమనీ శంభుడికి జాగ్రత్తలు చెప్పి మరీ తీసుకెళ్ళాడు వేదరాయశర్మ. కోట బయట సైనికుడి ద్వారా తమ రాక కబురు పంపించాడు. కొంతసేపటికి మహారాజ దర్శనానికి రమ్మనమని కబురొచ్చింది.

గురువు గారి వెనుకే శంభుడూ వెళ్ళాడు. రాజ మందిర వైభవం చూసి అతనికి ఆశ్చర్యం వేసింది. గతంలో రేవన్న ద్వారా రాజ వైభవం గురించి ఎంతగానో విన్నాడు. ప్రస్తుతం కళ్ళారా చూస్తున్నాడు.

రాజ మందిరంలో దేవరాయలు సింహాసనాధీశుడై ఉన్నాడు. అతనికి పక్కనే మంత్రీ, అతని బావమరిది నరేంద్ర గజపతి ఉన్నారు. అందరికీ నమస్కరించాడు వేదరాయ శర్మ.

అతనికి ప్రతి నమస్కారం చేస్తూ దేవరాయలు –

"పండితోత్తమా, మీ రాక మాకెంతో సంతోషంగా ఉంది. మీకు అన్ని సౌకర్యాలు అమరినట్లేనా?" అంటూ ప్రశ్నించాడు.

"మహారాజా, మీ దర్శనం మా కెప్పుడూ ఆనందదాయకమే! మీరు ఏర్పాటు చేసిన సదుపాయాలన్నీ ఘనంగా ఉన్నాయి." బదులిచ్చాడు వేదరాయ శర్మ.

వేదరాయా, మీరు పంపిన ముహూర్తం చూసాను. కోట ప్రాకార శంఖుస్థాపనకి మీరు స్వయంగా రావడం ఎంతో ఆనందకరం. మీరు పెట్టిన ముహూర్తం బాగానే ఉంది...కానీ..." సంశయంతో ఆగిపోయాడు.

వేదరాయశర్మకి అర్థకాలేదు. అయోమయంగా మహారాజు కేసి చూసాడు. మరలా దేవరాయలే విషయం చెప్పాడు.

"వేదరాయా! అష్టమి పూట ఏ పని చేస్తే కష్టాలొస్తాయని మా ఆస్థాన పండితుల సంశయం. అందువల్ల శనివారం ఉదయానికి బదులు సాయంత్రానికయితే బావుంటుందని వారి అభిప్రాయం. సాయంత్రానికి నవమి వచ్చేస్తుంది. అందువల్ల అంతా శుభం జరుగుతుందని వారు నిర్ణయించారు."

"మహారాజా! మీ జన్మ నక్షత్రానికి శనివార ఉదయం తారాబలం కుదిరింది. మీకు సంపత్తారయ్యింది. ఉదయం కాదని నవమి తిథిలో చేస్తే అది మీకు విపత్తారవుతుంది. ఇలాంటి ముహూర్తాలకి తిథి కంటే తారాబలమే ముఖ్యం."

దేవరాయలు పక్కనే ఉన్న ఆస్థాన పండితుని వైపు చూసాడు.

"మహారాజు తారా బలంకన్నా, ఈ సారి మహారాణి ఉమాదేవికి తారాబలం అమోఘంగా ఉంది. ఆమెకు సాధన తారయ్యింది. తిరుగులేని ముహూర్తం. మా గజపతుల ఆచారం ప్రకారం స్త్రీలకి నప్పితే చాలు. పురుషులకి నప్పకపోయినా దోషం ఉండదు."

వేదరాయశర్మ సంశయంలో పడ్డాడు. తన లెక్కల ప్రకారం మహారాజు నక్షత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. ఎందుకంటే అతనే రాజు. ఈ కార్యానికి కర్త. ఇదే విషయం చెప్పాడు. దేవరాయలు ఎందువలనో ఆస్థాన పండితుడి వైపే మొగ్గు చూపుతున్నట్లుగా అనిపించింది. కాదని చెప్పే ధైర్యం లేక సరే మీ ఇష్టం అని ఊరుకున్నాడు.

"మాహారాజా! నాకు తెలిసిన శాస్త్ర ప్రకారం లెక్కలు కట్టి ముహూర్తం పెట్టాను. మీ పండితులు చెప్పినట్లే చేద్దామంటే సరే! నేనడ్డు రాను. మీరు ఆదేశించినట్లుగానే శంఖుస్థాపన చేద్దాం."

వేదరాయశర్మ సమాధానం విని దేవరాయలు ఆస్థాన పండితుడు నిర్ణయించిన ముహూర్తమే ఖరారు చేసాడు. శనివారం సాయంత్రం కోట ప్రాకర శంఖుస్థాపన జరుగుతున్నట్లుగా ప్రకటించాడు.

వేదరాయ శర్మ ఎందుకో కీడు శంకించాడు. ఇంతవరకూ తను పెట్టిన ముహూర్తం ఎప్పుడూ తప్పలేదు. మహారాజా కాదనలేదు. ఈ సారి ఎందుకిలా అయ్యింది? అర్థం కాలేదతనికి. శనివారం వస్తానని చెప్పి శలవు తీసుకుంటూండగా, దేవరాయలు ఇలా అన్నాడు.

"వేదరాయా! మీరు చెప్పిన రోజునే ముహూర్తం ఉంది. కాకపోతే కాస్త అటూ, ఇటూ ఉంది. మీరంత కలవర పడనవసరం లేదు. సర్వదా విరూపాక్షుని దయ మాపై ఉంది. అన్నట్లు చెప్పడం మరిచాను. ఆదివారం రాత్రి మా మందిరంలో అత్యద్భుత నాట్య ప్రదర్శనుంది. దక్షిణాది నుండి ఒక నాట్యరమణి వచ్చింది. మీరూ తప్పక విచ్చేయాలి."

వేదరాయశర్మ సరే నంటూ శలవు తీసుకున్నాడు. ఆస్థాన పండుతులు నిర్ణయించిన శంఖుస్థాపన ముహూర్తం మరోసారి మనసులోనే లెక్కవేసాడు. ఏ మాత్రం మహారాజుకి కుదర్లేదు. అతని మనసు ఏదో కీడు శంకిస్తోంది. వద్దని మహారాజుని వారించలేడు. అక్కడికీ ఒకటి రెండు సార్లు చెప్పి చూసాడు. ఏదెలా జరగాలని ఉంటే అలా జరుగు తుందనుకొని తన బసకి వెనుదిరిగాడు. గురువుగారి మొహంలో చింతని గ్రహించాడు శంభుడు. అతనికీ విషయమర్థమయ్యింది. ఏం చెయ్యాలో పాలుపోలేదు.

"గురువుగారూ, మీరెందుకో కలవర పడుతున్నారనిపిస్తోంది. మీ ముహూర్తం కాదన్నందుకు మీరు దిగులు పడడం అనవసరమేమో? మీరు చెప్పల్సింది చెప్పారు కదా?" వేదరాయశర్మ అంతరంగాన్ని గ్రహించినట్లుగా అన్నాడు.

"శంభూ! ఆస్థాన పండితుడి ముహూర్త సమయం మహారాజుకి విపత్తారవుతుంది. మంచిది కాదు. గతంలో ఇలాగే మా తండ్రిగారు పెట్టిన ముహూర్తం కాదని ఆస్థాన పండితుల మాట వింటే అనర్థం జరిగింది. కోట బురుజు నిర్మాణం కూలిపోయి వందల మంది మరణించారు. మహారాజు హత్యకావింప బడ్డాడు. రాజ్యం అల్లకల్లోలమయ్యింది. అందువల్లే ఈ దిగులంతా..ఏం జరుగుతుందోనన్న శంక అంతే.."

"మీ చింత అర్థమయ్యింది గురువుగారూ! అయినా మనమేమీ చెయ్యలేం. కాలం కలిసి రానప్పుడు మంచిమాటలు మనసుకెక్కవు. మీరు నిశ్చింతగా ఉండండి. అంతా విరూపాక్షుడే చూసుకుంటాడు."

"నేనూ ఆ దేవుడి మీదే భారం వేసానురా శంభూ! ఇలాంటివి సర్దుకోడానికి కాస్త వ్యవధి కావాలి. సాయంత్రం విరూపాక్ష దర్శనానికి వెళదాం. ఇవాళా, రేపూ పూజలు చేయిద్దాం."

శంభుడు సరేనన్నాడు. అనుకున్నట్లుగానే సాయంత్రం విరూపాక్షాలయంలో అభిషేకం చేసొచ్చాక మనసు కుదుట పడింది.

మర్నాడు శనివారం సాయంత్రం ప్రాకార శంఖుస్థాపన జరిగింది. కొత్త మహరాణి ఉమాదేవితో కలిసి దేవరాయలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించాడు. కార్యక్రమంలో వేదరాయశర్మా పాల్గొన్నాడు. అందరితో కలసి మంత్రం చదివాడు. మనస్ఫూర్తిగా మాత్రం కాదు. ఏం అనర్థం జరుగుతుందోనన్న దిగులుతో ఆ రాత్రి చాలా సేపటి వరకూ నిద్ర పట్టలేదు.

00000000000

మర్నాడు దేవరాయలు రాజమందిరానికి రమ్మనమని కబురు పంపితే వేదరాయశర్మ వెళ్ళాడు. వేదరాయశర్మకి కానుకలిచ్చాడు దేవరాయలు. ఆ సందర్భంలోనే ఫిరోజ్‌షా ప్రస్తావన వచ్చింది. ముహూర్తం గొడవలో పడి ఫిరోజ్‌షా కొత్త కోట విషయమే మర్చిపోయాడు. తన వద్ద కొత్త కోట నమూనా ఉందని మాహారాజుకి చెప్పాడు.

"మహారాజా చెప్పడం మరిచాను. ఫిరోజ్‌షా భీమ నది ఒడ్డున ఒక కొత్త కోటని నిర్మిస్తున్నట్లుగా మసూం సమాచారం పంపాడు. అంతే కాదు. డిల్లీలో ఉన్న ఫతేపూర్ సిక్రీ కోటలా ధృఢంగా కట్టాలని కొత్త ఆలోచనలో ఉన్నాడు ఫిరోజ్‌షా. ఆ నమూనా నా వద్ద ఉంది. ఇప్పుడే మా శిష్యుణ్ణి విడిదికి పంపి తెప్పిస్తాను." అంటూ శంభుణ్ణి వెళ్ళి తీసుకు రమ్మనన్మని దేశించాడు.

దేవరాయలకిది కొత్త సమాచారం. తన వేగులెవరూ ఇంతవరకూ ఈ విషయం చెప్పలేదు. మసూమే కాకుండా చాలా మంది వేగుల్ని రాయచూరు సమీపంలో నియమించాడు. ఎవరూ ఈ వార్త ఇంతవరకూ అందించలేదు.

"అలాగా! ఈ విషయం నాకు తెలీదు. వేంటనే ఆ నమూనా తెప్పించండి. చూద్దాం"

ఆశ్చర్యంతో కూడిన దిగులు మొదలయ్యింది దేవరాయలకి. ఫిరోజ్‌షా సేనల్ని తిప్పి కొట్టి ఇంకా నాలుగు నెలలు కాలేదు. ఇంతలోనే మరో తిరుగుబాటికి పథకం కాదు కదా? ఇంత అత్యవసరంగా మరో కోట కట్టాల్సిన అవసరం ఫిరోజ్‌షాకేం కలిగింది. గుల్బర్గా కోట పెద్దదే కదా? ఫిరోజ్‌షా ఏ వ్యూహం రచిస్తున్నాడో? అతనివల్ల విజయనగరానికి ఖచ్చితంగా ముప్పు వుందని తెలుసు. ఎన్నో ఆలోచనలతో అతని మనసు కకావికలమయ్యింది. ఇది గ్రహించిన వేదరాయశర్మ మహారాజుని అనునయించాడు.

"మహారాజా! అనవసరంగా మీరు చింత పడనవసరం లేదు. గుల్బర్గా నగరానికి నీటి కరువుంది. అందువల్ల భీమనది నుండి గుల్బర్గాకి కాలువలు తవ్వే ప్రయత్నంలో ఉన్నారు. మూణ్ణేళ్ల క్రితమే యుద్ధం చేసి మరో యుద్ధానికి ప్రయత్నిస్తున్నారని నేనుకోను. కోట కట్టడం వెనుక ఉద్దేశ్యం తెలియదు. ఏం సమాలోచనలు జరుగుతున్నయో ఇప్పుడే చెప్పలేం. ఈ కోట నిర్మాణం మాత్రం మనపై దాడికి మాత్రం కాదనే చెప్పగలను."

దేవరాయలు శ్రద్ధగా విన్నాడు. నిజమేనన్నట్లు తలాడించాడు.

"ప్రత్యర్థి చెప్పి ఎదురుదాడి చెయ్యడు. కాబట్టి మన జాగ్రత్తలో మనం ఉండాలి. మా మంత్రులతోనూ, సైన్యాధికారులతోనూ చర్చిస్తాను. విలువైన సమాచారం అందించారు. మీ సేవలకి ఈ విజయనగరం ఎంతో రుణపడి ఉంటుంది. "

"రాజ్యాన్ని కాపాడిల్సిన బాధ్యత ఒక్క రాజుదే కాదు మహారాజా! ప్రజలది కూడాను. ప్రజల్లో చైతన్యముంటే రాజ్యంపై ఎవరూ దండెత్తలేరు. విజయనగర రక్షణ నా విధి. అంతే! " వేదరాయశర్మకి విజయనగరం అంటే అమితమైన ప్రేమ. దేశంకోసం ఏదైనా చెయ్యడానికి సిద్ధం. అందువల్లే మసూం అందించే సమాచారం చేరవేసే వేగు బాధ్యతా నెత్తిపై వేసుకున్నాడు.

కొంతసేపయ్యాక శంభుడు ఫిరోజ్‌షా కోట నమూనా తెచ్చిచ్చాడు.

"మహారాజా! ఇది మసూంణ తనకొచ్చిన రీతిలో గీసిచ్చిన నమూనా. నా శిష్యుడు శంభుడు మంచి చిత్రకారుడు. దాని ఆధారంగా మరింత స్పష్టంగా ఈ రెండో నమూనాలో చిత్రీకరించాడు శంభుడు. ఇది చూడండి" అంటూ శంభుడు వేసిన కోట నమూనా చూపించాడు.

చూడ్డమయితే చూసాడు కానీ దేవరాయలకి అంతగా అర్థం కాలేదు. మంత్రికి చూపించాడు. ఎంతో విశదంగా పరిశీలించాడు మంత్రి. మెల్లగా దేవరాయల చెవిలో ఏదో చెప్పాడు. తరువాత దేవరాయలు తన మనసులో ఉద్దేశ్యం చెప్పాడు.

"వేదరాయా! ఈ నమూనా మా సైనికాధికారులతో కలిసి చర్చించాలి. మీరు తెచ్చిన సమాచారం మాకు ఎంతో అవసరం. దానికి ధన్యవాదాలు. మరొక్క విషయం. ఇది అత్యంత గోప్యంగా ఉంచండి. ముఖ్యంగా మీ శిష్యులకిది చెప్పండి. మనుషుల్ని దాటితే మాటలు కొండలవుతాయి. అక్షరాలు ఆకాశాన్ని చేరుతాయి.

అవి మనమీద ఎప్పుడు కూలుతాయో ఎవరూ చెప్పలేరు. జాగ్రత్తగా ఉండడం సర్వదా శ్రేయస్కరం."

వేదరాయ శర్మకి మహారాజు ఆంతర్యం అర్థమయ్యింది. అలాగే నని చెప్పి తన శిష్యుల తరపున తాను రహస్యంగా ఉంచుతానని ప్రమాణం చేసాడు.

ఆ తరువాత రాయచూరు పరిసరాల్లో ఏం జరుగుతోందని వాకబు చేసాడు దేవరాయలు. రాజ్యభద్రత గురించి మంత్రులతో సుదీర్ఘంగా చర్చిందాడు దేవరాయలు. ఫిరొజ్‌షా ఇప్పట్లో తమపై దండెత్త లేడని తెలిసినా అంతర్లీనంగా కొత్త అనుమానాలు మొదలయ్యాయి.

000000000

ఆ నాడు సాయంత్రం మహారాజ మందిరంలో దక్షిణాది రమణి నాట్య ప్రదర్శన జరిగింది. వేదరాయ శర్మా, శంభుడూ ఇద్దరూ ప్రదర్శనకి వెళ్ళారు. రమణి నాట్యం చూసి దేవరాయలు ఎంతో ఆనందించాడు. ఇక్కడే కొంత కాలముండి మహారాణి ఉమాదేవికి నాట్యం నేర్పడానికి నియమించాడు. దేవరాయలు స్త్రీ లోలుడు. ఉమాదేవికి నాట్యం నేర్పడమన్నది ఒక వంక మాత్రమే! అంతర్లీనంగా రమణి పొందుకోసమే ఆమెను ఉండమన్నాడన్నది విజయనగరంలో అందరికీ తెలుసు.

రమణి నాట్యం వేదరాయ శర్మకి అంతగా నచ్చలేదు. అంతగొప్పగా నాట్యం లేదు. ఆమె ఓ మోస్తరుగా నాట్యం చేసింది. దానికే మహారాజు తబ్బిబ్బవ్వడం చూసి ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే తన శిష్యురాలు నేహల ఇంతకంటే వందరెట్లు బాగా నర్తించగలదు. నేహల ప్రతిభ ముందు రమణిది ఎందుకూ పనికిరాదు. నాట్యం ముగిసి అందరికీ కానుకలూ, సత్కారాలు జరిగాక రమణి నాట్య బృందం వెనక్కి వెళ్ళారు. వారు వెళ్ళాక దేవరాయలు ఒకటికి పది సార్లు రమణి నాట్యం గురించే చెబుతూంటే వేదరాయ శర్మకి కోపం వచ్చింది. చికాకు కలిగింది. ఇహ ఉండబట్టలేక వేదరాయశర్మ తన మనసులో మాట బయట పెట్టాడు. దాచుకోకుండా ఉన్నది ఉన్నట్లు అనేసాడు.

"మహారాజా! ఇలా అంటున్నందుకు మన్నించాలి. ఇంతకుముందు రమణి చేసిన నాట్యం మీరనుకునేంత గొప్పగా లేదు. నాట్యం చేసేటప్పుడు కొన్ని ముద్రలు సరిగా లేవు. తాళం తప్పింది. నాట్యం నడక లయతప్పింది. ఈ రమణి కంటే ఎంతో ఉత్తమంగా నాట్యం చేసే వాళ్ళు మన రాజ్యంలోనే అనేకమందున్నారు. అంతెందుకు నా శిష్యురాలు నేహల ముందు వీళ్ళంతా దిగదూడుపే! మీరు ప్రతిభ లేని వ్యక్తికి అనవసర సత్కారాలూ, మర్యాదలూ చేసి తగని హోదాలని ప్రకటిస్తూంటే ఉండబట్టలేక చెబుతున్నాను. అన్యధా భావించకండి."

వేదరాయశర్మ మాటలు కటుక్కున గుచ్చుకున్నాయి మహారాజుకి.

"అదేమిటి వేదరాయా! ఆమె ఎంతో అందంగా ఉంది. దానికి మించి నాట్యం చేసింది. సభలో అందరూ తెగ మెచ్చుకుంటే మీరొక్కరే ఇలా విమర్శిస్తున్నారు. చిత్రంగా ఉంది."

వేదరాయశర్మకి ఏం చెప్పాలో తెలీదు. కొంతసేపు మౌనంగా ఆలోచించాడు.

"మహారాజా! మీరంటే ఉన్న భయం వల్లా, గౌరవం వల్లా సభలో ఎవరూ నాట్య విమర్శ చెయ్యడానికి సాహసించలేదు. అంతెందుకూ అప్పుడు నేనూ మౌనంగానే ఉన్నాను. కానీ మీరు పదే పదే  కొనియాడుతూంటే మీతో ఉన్న చనువు వల్లా, స్నేహం వల్లా మనసులో మాట చెప్పాను. మరోసారి చెబుతున్నాను. నా శిష్యుల నాట్యం ముందు ఈమె నాట్యం ఎందుకూ పనికి రాదు."

దేవరాయలకి ఒక్క సారి చిన్నగా కోపం వచ్చింది.

"అలాగా! అయితే మీ శిషుల నాట్యం మరి మాకెందుకు చూపించలేదు?"

"చూపించానుకదా మహారాజా! దసరా ఉత్సవాలకి నా శిష్యులందరూ వచ్చి ప్రదర్శనిచ్చి మీ అభిమానం చూరుగొన్నారు కదా? మర్చిపోయారా?"

"గుర్తుంది. మర్చిపోలేదు. ఇంతకు ముందు మీరొక అమ్మాయి పేరు చెప్పారు..ఏమిటది? ఆమె దసరా కొచ్చినపుడు నాట్యం చేసిందా? గుర్తు రావడం లేదు."

" అమ్మాయి పేరు నేహల. దసరా ఉత్సవాలకి ఆమె రాలేదు."

"ఎందుకు రాలేదు?"

మహారాజు ప్రశ్న విని ఏం చెప్పాలో తెలియలేదు వేదరాయశర్మకి.

"ఆమెకి పదిమంది ముందూ నాట్యం చెయ్యడం ఇష్టం లేక రానంది. నేనెంత బ్రతిమాలినా రాలేదు. ఎంతో అద్భుతంగా నాట్యం చేస్తుంది. మీరు చూసే తీరాలి. ఆమెకి నాట్యంలోనే కాదు. అందంలోనూ ఎవరూ సాటిరారు. దేవలోకం నుండి ఊడిపడ్డ ఒక అప్సరస. ఒక్క మాటలో చెప్పాలంటే - ముగ్ధ."

నేహల అందాన్ని అంతగా వర్ణిస్తున్న వేదరాయశర్మ మాటలకి ఆశ్చర్యపోయాడు దేవరాయలు. నేహల నాట్యం చూడాలన్న రాటం బయల్దేరింది. దేవరాయలకి నాట్యం అంటే చాలా ఇష్టం.

"మరి ఇన్నాళ్ళూ మాకెందుకు చెప్పలేదు? ఆమె నాట్యం మేం చూడకూడదా?"

"చెప్పానుగా మహారాజా! ఆమె పరుల ముందు నాట్య ప్రదర్శన చెయ్యదు. నాకు తెలిసీ మా వూరి  అశ్వత్థ  నారాయణ స్వామి దేవాలయంలో ఒకే ఒక్క సారి ప్రదర్శనిచ్చింది. అంతే! ఎన్నో సార్లు బ్రతిమాలి, విసిగి పోయాను. కళ్ళు చెదిరే అందమొక్కటే కాదు, మాట వినని మొండిది కూడా. చెప్పానుగా వర్ణింప నలవికాని అందం ఆమెది."

వేదరాయ శర్మ మాటలు దేవరాయలుకి మనసుకి సూటిగా గుచ్చుకున్నాయి. అంతలా పొగడడం చూసి వేదరాయశర్మ కావాలనే తన నిర్ణయాన్నీ, అభిరుచినీ కించపరచడానికే పై విధంగా అంటున్నాడన్న భావన మొదలయ్యింది.

"ఓ అంత అందగత్తా? మా మహారాణి ఉమాదేవి కంటే అందగత్తా?" రెట్టించాడు దేవరాయలు.

హఠాత్తుగా మహారాణి ప్రస్తావనొచ్చేసరికి ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు వేదరాయశర్మ. మహారాణి అందాన్ని నేహలతో పోల్చడం వల్ల తనమీద మహారాజుకి కోపం రావచ్చు. తద్వారా ఘర్షణ పెరగవచ్చు. ఎందుకొచ్చిన గొడవని మౌనం వహించాడు వేదరాయ శర్మ.

ఆ మౌనం చూసి మరింత రెచ్చిపోయాడు దేవరాయలు.

"చెప్పడి వేదరాయా? మా మహారాణి ఉమాదేవి కంటే అందగత్తా?"

దేవరాయల మాటల్లో ఆవేశం కనిపించింది అక్కడున్న అందరికీ. ఎవరూ పైకి ఏమీ అనే ధైర్యం చెయ్యలేదు. నోరు మెదపకుండా చూస్తున్నారు. ఎంత రెట్టించినా వేదరాయ శర్మ మౌనం వీడలేదు. తలొంచుకునే ఉన్నాడు. ఇది చూస్తున్న శంభుడిలో భయం మొదలయ్యింది. అనవసరంగా గురువుగారు మహారాజు ఆగ్రహానికి గురి కావల్సి వస్తుందేమోనన్న కంగారు బయల్దేరింది.

దేవరాయలకి  ఆ మౌనం అవమానంగా తోచింది.

"చెప్పండి వేదరాయా! అలా మౌనంగా ఉండిపోయారేం? ఏం మా మహారాణి కంటే అందగత్తా? చెప్పరేం?"

వేదరాయశర్మ మౌనంగా సమాధానం చెప్పాడు. మహారాజు ఆగ్రహమూ, ఆవేశమూ అర్థమయ్యాయి.

"మహారాజా, మీరంతగా ప్రశ్నిస్తున్నారు కనుక చెబుతున్నాను. నేహల అందం ముందు ఎవరూ నిలవలేరు. అమె ఒక అపురూప సుగుణాల రాశి. ఇంతకు మించి చెప్పలేను. దయచేసి నన్ను క్షమించండి."

ఒక్క మాటలో నేహల గురించి వర్ణించేసరికి దేవరాయల మాటల్లో వేశం తగ్గింది. మహారాణి ఉమాదేవి అందాన్ని తక్కువ చేసినందుకు కోపం వున్నా, నేహలని చూడాలన్న ఉత్సాహం బయల్దేరింది. వేదరాయ శర్మ అంత ధీమాగా చెబుతున్నాడంటే ఆమె నిజంగా ఒక సౌందర్య రాశే అన్న భావన కలిగింది. ఒక్కసారి  ఆ అందాన్ని చూడాలనిపించింది.

"దేవరాయా! ఇంతగా మీరు వర్ణిస్తుంటే  ఆ అమ్మాయిని చూడాలనిపిస్తోంది. ఆమె అంత అందంగా ఉంటుందా?"

"అవును మహారాజా! గంధర్వలోకం నుండి ఊడి పడ్డ దేవకన్యలా ఉంటుంది. మీరు అనుమతివ్వండి. నాలుగు రోజుల్లో ఆమె బొమ్మ గీసి చూపిస్తాను."

దేవరాయల ప్రశ్నకి జవాబుగా ఒక కొత్త గొంతు వినిపించేసరికి అందరూ అటువైపుగా చూసారు. వేదరాయ శర్మ గొంతు కాదది. ఆయన వెనుకే ఉన్న వ్యక్తిదని అందరూ గ్రహించారు.  ఆ వ్యక్తెవరో కాదు. శంభుడు.

అప్రయత్నంగా శంభుడి నోట వచ్చిన మాటలు విని తలెత్తి పక్కకు చూసాడు వేదరాయ శర్మ. పైకి ఏమీ అనలేదు. తను అనవసరంగా నోరు జారానాని భయంతో గురువుగారి వైపి దీనంగా చూసాడు.

శంభుడి సమాధానం విని దేవరాయలు కళ్ళు మెరిసాయి.

"ఓ తప్పకుండా! నువ్వు ఆమె చిత్ర పటం గీసియ్యి. మా మానసు ఆమె అందాన్ని చూడాలని ఉవ్విళ్ళూరుతోంది. మీ చిత్రలేఖనానికి కావల్సిన సుదుపాయాలు మేం అమరుస్తాం. వేంటనే మీరు పనిలో ఉండండి."

మహారాజు మాట విని శంభుడు ఏ రకమైన ప్రతిస్పందనా చూప లేదు.

"అలాగే మహారాజా, శంభుడు ఆమె చిత్ర పటం గీసిస్తాడు." వేదరాయ శర్మే శిష్యుడి మాటగా చెప్పాడు.

గురువు అనుమతి లభించినందుకు ఆనందించాడు శంభుడు. మహారాజుకి తన ప్రతిభ చూపించే ఒక పెద్ద అవకాశం కలిగినందుకు లోలోపల ఎంతో సంతోషించాడు శంభుడు. తరువాత వేదరాయ శర్మ మహారాజు వద్ద శలవు తీసుకున్నాడు.

దేవరాయలకి మాత్రం క్షణ క్షణానికి నేహలని చూడాలన్న ఆరాటం పెరిగింది.

ఆ ఆరాటం ఎన్ని అనర్థాలకి దారితీస్తుందో అతనికి క్షణంలో తట్ట లేదు.

000000000000 .

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library